
సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం ၊ 25 ၊ సెప్టెంబర్ ၊ 2024



27న బ్యాంకు ఉద్యోగుల సమ్మె

సమస్యల పరిష్కారానికి ఈ నెల 27న సమ్మె చేపడుతున్నట్టు యూనియన్ బ్యాంకు ఉద్యోగులు, అధికారుల సంఘం తెలిపింది. 8లో



ప్రమాదస్థాయికి రైవాడ

రైవాడ జలాశయ నీటిమట్టం ప్రమాద స్థాయికి చేరింది. గరిష్ట నీటిమట్టం 114 మీటర్లు, ప్రస్తుతం 113 మీటర్లు ఉంది. 8లో

బెల్లం దిమ్మలతో అలంకరణ



భీమిలి: మజ్జివలసలో రాస పోలమాంబ అమ్మవారిని ఆలయ కమిటీ ప్రతినిధులు పువ్వులు, బెల్లం దిమ్మెలతో అలంకరించారు.

న్యూస్‌రీల్

గిరిజన సంక్షేమ ఈఈగా శ్రీనివాసరావు



రంపచోడవరం: రంపచోడవరం ఐటీడీఏ గిరిజన సంక్షేమశాఖ ఈఈగా ఐ. శ్రీనివాసరావును నియమితులయ్యారు. గతంలో ఆయన ఐటీడీఏలో వర్క్ ఇన్‌స్పెక్టర్, జేడీ, డీఈగా సుదీర్ఘ కాలం పనిచేశారు. ఆయనను పలువురు అభినందించారు.

పాడేరు ఘాట్‌లో భారీ వర్షం



మినుములూరు వద్ద కురుస్తున్న వర్షం

సాక్షి,పాడేరు: మన్యంలో గత నాలుగు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం మధ్యాహ్నం నుంచి పాడేరు ఘాట్‌లో భారీ వర్షం కురిసింది. జిల్లా కేంద్రమైన పాడేరులో అరగంట సేపు మోస్తరు వర్షం కురిసింది.

రేపటి నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా పోటీలు

విశాఖ విద్య: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం నుంచి ఉమ్మడి జిల్లా స్థాయిలో పాఠశాల, జూనియర్ కాలేజీల క్రీడాపోటీల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ దేముడు బాబు తెలిపారు. గురువారం అండర్ -14, అండర్ -17 బాలబాలికల అథ్లెటిక్స్ ఆంధ్రా యూనివర్సిటీ గ్రౌండ్‌లో, రెజ్లింగ్ పోటీలు అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు జీటీడబ్ల్యూఏఎస్ (బాలురు) పాఠశాలలో జరుగుతాయన్నారు. 27న ఆనందపురం కేకేఆర్ గౌతమ్ స్కూల్ క్రీడా మైదానంలో అండర్ -17 బాలబాలికల మోడరన్ పెంటాథిలిన్ పోటీలు ఉంటాయన్నారు. 28న అండర్ -14, అండర్-17 స్విమ్మింగ్ పోటీలు రైల్వే స్టేడియం ఆర్ఆర్ ఆక్వాలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 30న అండర్ -17 నెట్‌బాల్ జెడ్పీహెచ్‌ఎస్ కణితిలో నిర్వహిస్తామని ఆయన తెలిపారు.


కేజీబీవీలో వంటకాల పరిశీలన



వంటకాలను పరిశీలిస్తున్న జీసీడీవో సూర్యకుమారి

కొయ్యూరు: స్థానిక కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని మంగళవారం సాయంత్రం జీసీడీవో సూర్యకుమారి సందర్శించారు. విద్యార్థినుల కోసం తయారుచేసిన వంటకాలను పరిశీలించారు. తగినంత కందిపప్పు లేక సాంబారుకు బదులు సిద్ధః చేసిన రసాన్ని ఆమె పరిశీలించారు. రుచిగా, నాణ్యతతో భోజనాలు ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. కేజీబీవీలకు అన్నీ టెండర్ ద్వారానే వస్తాయని, కొన్ని రకాల వస్తువులు రావడంలో జాప్యం జరుగుతుందని ఆమె తెలిపారు. వెంటనే వెండర్‌తో మాట్లాడి సకాలంలో సరకులు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని జీసీడీవో తెలిపారు. రెండు పూటలా వాడుతున్న కందిపప్పు వివరాలను తెలుసుకున్నామన్నారు. మజ్జిగ పలుచగా ఉండడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు

'జూడో'లో విద్యార్థుల ప్రతిభ



సాధించిన మెడల్స్‌తో విద్యార్థులు

విశాఖ విద్య: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22,23 తేదీల్లో తిరుపతిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా విద్యార్థులు సత్తాచాటినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి దేముడు బాబు మంగళవారం తెలిపారు. అండర్ -14 బాలికల విభాగంలో బత్తిన పద్మ ప్రియాంక (జెడ్పీహెచ్ఎస్, పాయకరావుపేట) సిల్వర్ మెడల్ సాధించింది. సమ్మంగి భాగ్యశ్రీ (శొంఠ్యాం, వెంకట విద్యాపీఠ్) కాంస్య పతకం కైవసం చేసుకుంది. అండర్-14 బాలుర విభాగంలో షేక్ సమీర్ ఖాన్ (శొంఠ్యాం, వెంకట విద్యాపీఠ్) కాంస్య పతకం, గోడ చరణి (జెడ్పీహెచ్ఎస్, వడ్డాది) సిల్వర్ మెడల్ సాధించారు. వీరిని విశాఖ, అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారులు చంద్రకళ, వెంకటలక్ష్మమ్మ అభినందించారు. టీమ్ కోచ్‌గా ఎల్.అప్పలరామ్, మేనేజర్‌గా ఎస్కే బేబీ వ్యవహరించారు.

మన్యంలోని పర్యాటక ప్రాంతాల సందర్శనకు దూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి శుభవార్త. అరకు, బొర్రా రైల్వేస్టేషన్ల మాదిరిగానే అమృత్ భారత్ పథకంలో గోరాపూర్ స్టేషన్‌ను రైల్వేశాఖ ఆధునికీకరించింది. ప్రయాణికులు రాకపోకలు **సాగించేందుకు అనువుగా తీర్చిదిద్దింది. అన్నివసతులు కల్పించింది. ఈ స్టేషన్‌లో కూడా దిగి పర్యాటక ప్రాంతాలకు వెళ్లవచ్చని పేర్కొంది.**

ఇదిగో గోరాపూర్



- ప్రయాణికులకు అనువుగా రైల్వేస్టేషన్ ఆధునికీకరణ
- 'అమృత్ భారత్'లో నిధుల కేటాయింపు
- బొర్రా, అరకు మాదిరిగానే సౌకర్యాలు
- ఇక్కడికి చేరువలో సందర్శనీయ ప్రాంతాలు
- పర్యాటకులకు మరింత అనువు

డుంబ్రిగుడ: గోరాపూర్..ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో పురాతన రైల్వేస్టేషన్. ఇది ఆంధ్రా పరిధిలో ఉందన్న విషయం చాలామందికి తెలియదు. ఒడిశాలోని చటువ స్టేషన్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్నందున ఇది ఆ రాష్ట్రానికి చెందినదిగానే అందరూ భావిస్తుంటారు. మండల కేంద్రం డుంబ్రిగుడతోపాటు, పర్యాటక కేంద్రం అరకుకు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ స్టేషన్‌లో రైల్వేశాఖ పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించింది.

➡ తూర్పు కనుమల్లో ఉన్న ఈ రైల్వేస్టేషన్ జిల్లా కేంద్రమైన పాడేరుకు 38 కిలోమీటర్ల దూరంలో ఉంది. అరకు, బొర్రా స్టేషన్లలో మాదిరిగానే విశాఖపట్నం- కిరండూల్ మధ్య తిరిగే ప్యాసింజర్ రైలు ఆగుతుంది. అయితే ఈ స్టేషన్ ఒడిశా సరిహద్దులో ఉన్నందున, పేరు కూడా గోరాపూర్ కావడంతో ఇది ఆ రాష్ట్రానికి చెందిన స్టేషన్‌గా అందరూ భావించేవారు. అందువల్ల ఈ స్టేషన్‌కు పర్యాటకులు, ప్రయాణికులు వెళ్లేవారు కాదు. ఈ మార్గాన్ని డబల్ లైన్‌గా రైల్వేశాఖ ఆధునికీకరించింది. ఇక్కడి నుంచి కోరాపుట్, రాయగడ మీదుగా దేశంలో ఏ ప్రాంతానికైనా చేరుకోవచ్చని రైల్వే అధికారవర్గాలు తెలిపాయి.

➡ విశాఖపట్నం నుంచి ప్రతిరోజు ఉదయం 6.45 గంటలకు బయలుదేరే కిరండూల్ పాసింజర్ ఎస్.కోట, బొర్రా మీదుగా అరకు 11.30 గంటలకు, ఈ స్టేషన్‌కు మధ్యాహ్నం 12 గంటలకు వస్తుంది. తిరుగు మార్గంలో కిరండూల్ నుంచి వచ్చే పాసింజర్ రైలు ఇక్కడికి 3 గంటలకు వస్తుంది. విశాఖపట్నం రాత్రి 9 గంటలకు చేరుకుంటుంది.

➡ గోరాపూర్ స్టేషన్‌లో పాసింజర్ రైలు ఆగుతుందని తెలియకపోవడంతో ఈ ప్రాంతాలకు చెందిన వారు అరకు స్టేషన్‌కు వెళ్లి రైలు ఎక్కుతుంటారు.

అందుబాటులోకి సౌకర్యాలు..

పురాతన రైల్వేస్టేషన్ కావడంతో ఏమాత్రం సౌకర్యాలు ఉండేవి కావు. ప్లాట్‌ఫామ్ ఎత్తు తక్కువగా ఉండేది. దీనివల్ల దిగేందుకు ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఇప్పుడు ఎత్తుగా నిర్మించారు. ప్రయాణికులు వేచి ఉండేందుకు వెయిటింగ్ హాల్, టికెట్ కౌంటర్, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించింది. భవనాలు ఆధునికీకరించడంతో స్టేషన్ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. ఇప్పుడిప్పుడే ప్రయాణికుల సంఖ్య పెరుగుతోందని రైల్వే అధికారవర్గాలు తెలిపాయి.

➡ గోరాపూర్ రైల్వేస్టేషన్‌కు వెళ్లాలంటే పాడేరు - అరకు మార్గంలో జైపూర్ జంక్షన్‌లో దిగాలి. అంజోడ సిల్క్ ఫారం, కిల్లోగుడ, అడపవలస మీదుగా స్టేషన్‌కు చేరుకోవచ్చు.

➡ ఈ స్టేషన్‌కు సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో అంజోడా సిల్క్‌ఫారమ్ (అరకు పినారి), చాపరాయి జలతరంగణి పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. కొల్లాపుట్ జలపాతం కూడా ఇక్కడికి చేరువలో ఉంది. ఇక్కడ పర్యాటకులు బసచేసేందుకు అనువుగా పాడేరు ఐటీడీఏ కాటేజీల సౌకర్యం కల్పించింది.



ప్రయాణికుల కోసం నిర్మించిన నూతన భవనం



ఆధునికీకరించిన కంట్రోల్ రూమ్ భవనం

పాసింజర్ రైలు అవసరం

విశాఖపట్నంకు వెళ్లేందుకు ఉదయం 6గంటలకు గోరాపూర్ స్టేషన్ నుంచి బయలుదేరేలా పాసింజర్ రైలు ఉంటే ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. విశాఖపట్నం ఉదయం 10 గంటలకు చేరుకునే సౌకర్యం అందుబాటులోకి వస్తుంది. దూర ప్రాంతాలకు వెళ్లేవారికి అనువుగా ఉంటుంది.

– లచ్చు, సర్పంచ్, గోరాపూర్, కురిడి పంచాయతీ, డుంబ్రిగుడ మండలం

ప్రయాణికుల సంఖ్య పెరిగే అవకాశం

రైల్వే స్టేషన్‌ను ప్రయాణికులకు అనువుగా ఆధునికీకరించింది. దీంతో ఈ ప్రాంతం నుంచి దూరప్రాంతాలకు వెళ్లేవారికి సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. కొద్దిరోజుల్లో పర్యాటక సీజన్ ప్రారంభం కానుంది. దీంతో ఈ స్టేషన్‌కు వచ్చే వారి సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఇక్కడ 40 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

– ఆర్.ముకుందరావు, స్టేషన్ మాస్టర్, గోరాపూర్

పకనకుడిలో రెండున పీఎం జనమన్

- వర్చువల్ విధానంలో సంభాషించనున్న ప్రధానమంత్రి మోదీ
- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ వెల్లడి



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

అరకులోయ రూరల్: మండలంలో పకనకుడి గ్రామంలో వచ్చేనెల 2వ తేదీన నిర్వహించే పీఎం జన్‌మన్ కార్యక్రమంలో పీఎం మోదీ వర్చువల్ విధానంలో పాల్గొంటారని పాడేరు ఐటీడీఏ పీవో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ తెలిపారు. మంగళవారం కేంద్ర గిరిజన సంక్షేమ వ్యవహారాల శాఖ కార్యదర్శి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ పీటీజీ మహిళ స్వాభి గంగతో మోదీ సంభాషిస్తారని తెలిపారు. గత జనవరిలో నిర్వహించిన ప్రధానమంత్రి జన్‌మన్ కార్యక్రమానికి సంబంధించి ఫొటో ఆల్బమ్‌ను అధికారుల ద్వారా పీఎంకు బహూకరిస్తారని ఆయన పేర్కొన్నారు.

ఏటీఎంలో నాగుపాము హల్‌చల్

- పట్టుకున్న స్నేక్ క్యాచర్ భాస్కర్



సాక్షి,పాడేరు: పట్టణంలోని జీసీసీ సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎం వద్ద మంగళవారం సాయంత్రం నాగుపాము హల్‌చల్ చేసింది. వెంటనే స్థానికులు స్నేక్ క్యాచర్ భాస్కర్‌కు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న అతను వెంటనే పట్టుకుని ప్లాస్టిక్ సీసాలో బంధించారు. సమీప అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



మర్రి కామయ్య విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎస్పీ అమిత్ బర్దర్



వాలీబాల్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎస్పీ అమిత్ బర్దర్

- ఎస్పీ అమిత్ బర్దర్
- కామయ్యపేటలో పర్యటన
- వృద్ధులకు రగ్గులు, యువకులకు వాలీబాల్ కిట్ల పంపిణీ

హుకుంపేట: గిరిజన యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ మంచి భవిష్యత్తు ఏర్పాటుకు ప్రాధాన్యమివ్వాలని ఎస్పీ అమిత్ బర్దర్ సూచించారు. మంగళవారం మండలంలోని తీగలవలస పంచాయతీ కామయ్యపేటలో ఆయన పర్యటించారు. సీఐ సన్యాసినాయుడు అధ్యక్షతన గంజాయి నిర్మూలనపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. గ్రామ గిరిజనులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. స్వాతంత్ర్య ఉద్యమకారుడు మర్రి కామయ్య సమాధి వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. గిరి యువత సన్మార్గంలో నడుచుకోవాలని, గంజాయి వంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సూచించారు. మహిళలు, వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు.యువకులకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ పాంగి బేసు, ఎంపీటీసీ కొర్ర నాగరాజు, మాజీ ఎంపీటీసీ పాంగి రామరావు, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫేషియల్ హాజరు తప్పనిసరి

- ఉపాధ్యాయులకు డీఈవో బ్రహ్మాజీరావు ఆదేశం

ముంచంగిపుట్టు: ఉపాధ్యాయులు ఫేషియల్ హాజరు ప్రతీ రోజు వేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావు ఆదేశించారు. మంగళవారం ఆయన మండలంలో ముంచంగిపుట్టు గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల డిజిటల్ తరగతులను పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు అమలు చేస్తున్న భోజన మెనూ, ప్రాథమిక పాఠశాలల్లో అమలు జరుగుతున్న మధ్యాహ్న భోజన పథకం అమలును ఆయన తనిఖీ చేశారు. పాఠశాల విద్యార్థుల హాజరు రోజూ వేయాలని, ఉపాధ్యాయులు పాఠ్య ప్రణాళిక డైరీని ప్రతిరోజు రాయాలని సూచించారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సిలబస్ పూర్తి చేయాలని, టాయిలెట్ల ఫొటోలను స్కూల్ అటెండెన్స్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అనంతరం జోలాపుట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పనసపుట్టు, లబ్బూరు ఆశ్రమ పాఠశాలలను సందర్శించారు. ఆయన వెంట ఎంఈవో కృష్ణమూర్తి ఉన్నారు.

అభివృద్ధి పనులు గడువులోగా పూర్తి

కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దీ గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ నుంచి ఆయన పాడేరు డివిజన్ అధికారులతో ప్రత్యక్షంగా, రంపచోడవరం, చింతూరు డివిజన్ల అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. వారితో పనుల పురోగతిపై సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ అధికారులకు అప్పగించిన వంద రోజుల కార్యాచరణ మేరకు పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో అన్ని అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పాడేరు,అరకు పరిధిలో 14 బర్త్ వెయిటింగ్ హాల్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగానికి మంజూరు చేసిన 170 పనుల్లో ఇప్పటి వరకు 45 పూర్తయ్యాయని, మిగిలిన పనులు నవంబర్ నెలాఖరుకు పూర్తి చేయాలని సూచించారు. 72 బీటీ రోడ్లలో ఇప్పటివరకు 14 పనులు పూర్తి కాగా, మిగిలినవి డిసెంబర్ నాటికి పూర్తి చేయాలన్నారు. పీఐయూ, ఆర్అండ్‌బీ, ఎస్ఎంఐ శాఖల పనులు కూడా వేగవంతం చేయాలన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్-24లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని సూచించారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా ప్రజల ప్రతిస్పందన సేకరించాలన్నారు. పర్యాటక సేవలపై అవగాహన కల్పించాలని, ఈనెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని అన్ని పర్యాటక ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించాలని సూచించారు. పాఠశాలల్లో యువ టూరిజం క్లబ్‌లు ఏర్పాటు చేయాలని, అక్టోబర్ 2 వరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా ముమ్మరం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్‌గౌడ్, పీఆర్ఈఈ కొండయ్యపడాల్, ఆర్అండ్‌బీ ఈఈ బాలసుందరబాబు, గిరిజన సంక్షేమశాఖ పాడేరు, అరకు ఈఈలు డీవీఆర్ఎం రాజు, కె.వేణుగోపాల్, జిల్లా టూరిజం అధికారి దాసు, అన్ని మండలాల ఎంపీడీవోలు పాల్గొన్నారు.

భారీ వర్షం.. పొంగిన వాగులు

- బైక్‌తో కొట్టుకుపోయిన చోదకుడు
- అతనిని కాపాడేందుకు ప్రయత్నిస్తూ ప్రవాహంలో చిక్కుకున్న ముగ్గురు వ్యక్తులు
- చెట్టుకొమ్మల సాయంతో ఒడ్డుకు చేరిన ఆ నలుగురు
- తప్పిన ప్రాణాపాయం.. ఊపిరి పీల్చుకున్న స్థానికులు



కిమ్మలిగెడ్డ వెళ్లే రహదారిలో పొంగిన వాగు



వాగులో కొట్టుకుపోతున్న బైక్‌ను బయటకు తీస్తున్న యువకులు

రాజవొమ్మంగి: మండలంలో మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి కిమ్మలిగెడ్డ చిన్నేరుతో పాటు పలు కొండవాగులు పొంగి ప్రవహించాయి. చిన్నేరు ఉధృతికి దాదాపు రెండు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. దీనిని దాటేందుకు ప్రయత్నించిన ఓ యువకుడు అందరూ చూస్తుండగానే బైక్‌తో కొట్టుకుపోయాడు. అతనిని కాపాడేందుకు ఉపాధ్యాయుడు రామకృష్ణ, కిమ్మిగెడ్డకు చెందిన దొడ్డంరెడ్డి ఆంజనేయులు, ఎల్లెం ప్రసాద్ వరదనీటిలోకి దిగి ప్రయత్నించారు. కొట్టుకుపోబోవడంతో చెట్టుకొమ్మలను పట్టుకుని ఒకరికొకరు సాయం చేసుకుంటూ నలుగురు ఒడ్డుకు చేరుకున్నారు. ప్రాణాపాయం నుంచి బయటపడటంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. చిన్నేరు ఉధృతి తగ్గుముఖం పట్టిన తరువాత బైక్‌ను బయటకు తీశారు.

విస్తృతంగా గాలింపు చర్యలు



పాములేరు వాగు వద్ద గాలింపు బృందాలకు సూచనలిస్తున్న ఏఎస్పీ జగదీష్ ఆడహళ్లి



అటవీప్రాంతంలో గాలింపు చేపడుతున్న ప్రత్యేక బృందాలు

లభ్యంకాని వైద్య విద్యార్థి హరదీప్ ఆచూకీ

మారేడుమిల్లి : మండలంలో ప్రముఖ పర్యాటక కేంద్రం జలతరంగిణిలో గల్లంతైన ఏలూరు ఆశ్రం వైద్య విద్యార్థి హరదీప్ ఆచూకీ లభ్యం కాలేదు. విహారయాత్రకు వచ్చిన వైద్య విద్యార్థుల్లో ముగ్గురు ద్వితీయ సంవత్సరం చదువుతున్న వైద్య విద్యార్థులు కె.సౌమ్య, బి.అమృత, సీహెచ్ హరదీప్ గల్లంతవడం తెలిసిందే. వీరిలో కె.సౌమ్య, బి.అమృత మృతదేహాలు సోమవారం లభ్యమయ్యాయి. హరదీప్ ఆచూకీ మాత్రం మంగళవారం కూడా లభ్యం కాలేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ ఆడహళ్లి, మారేడుమిల్లి సీఐ గోపాల్ కృష్ణ పర్యవేక్షణలో రెవెన్యూ, అటవీశాఖ, అగ్నిమాపక, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు విస్తృతంగా గాలించాయి. గల్లంతైన ప్రాంతం నుంచి వాగు వెంబడి చెట్లు, తుప్పలు, కల్వర్టులు, పాములేరు వాగు ప్రాంతాల్లో జల్లెడ పట్టాయి. రాత్రి వరకు గాలింపు చర్యలు జరుగుతూనే ఉన్నా ఎటువంటి జాడ లభించలేదు.

నేడు ఐటీఐలో జాబ్‌మేళా

కంచరపాలెం (విశాఖ): స్థానిక కంచరపాలెం ప్రభుత్వ పాత పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఐటీఐ)లో మేధా సర్వో డ్రైవ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో బుధవారం ఐటీఐ కోర్స్ పూర్తి చేసిన విద్యార్థులకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పాత ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీకాంత్ తెలిపారు. ఐటీఐలో ఫిట్టర్స్, వెల్డర్, ఎలక్ట్రిషియన్, మెకానికల్ కోర్సు ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు, అప్రెంటిస్ షిప్ పూర్తిచేసిన అభ్యర్థులు జాబ్ మేళాకు హాజరుకావాలని కోరారు. అసక్తి కల్గిన అభ్యర్థులు ధ్రువపత్రాలతో ఉదయం 10గంటలకు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 94401-97068లో సంప్రదించాలన్నారు.

కోర్టు ఉద్యోగాల ఇంటర్వ్యూలు వాయిదా

మహారాణిపేట(విశాఖ): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఆఫీసు అసిస్టెంట్ (03), రిసెప్షనిస్ట్ కమ్ డేటా ఎంట్రీ ఆపరేటర్ (1), ఆఫీసు సబార్డినేట్ (3) ఉద్యోగాల నియామకాలకు ఈ నెల 26, 27వ తేదీల్లో నిర్వహించాల్సిన ఇంటర్వ్యూలు వాయిదా పడినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.వి. శేషమ్మ తెలిపారు. ఇంటర్వ్యూలను ఈ నెల 30వ తేదీ మధ్యాహ్నం 4 గంటలకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు దరఖాస్తుల పరిశీలన, ధ్రువీకరణ నిమిత్తం ఆ రోజు మధ్యాహ్నం 3 గంటల లోపు విశాఖ జిల్లా కోర్టుల సముదాయంలోని న్యాయ సేవా సదన్‌కు చేరుకోవాలని సూచించారు.

సంగోడిలో ధ్వజస్తంభ ప్రతిష్టకు ఏర్పాట్లు

- 36 అడుగుల టేకు చెట్టు తరలింపు



ధ్వజస్తంభం కోసం తరలిస్తున్న టేకు చెట్టు

డుంబ్రిగుడ: మినుములూరు పంచాయతీ సంగోడిలో పార్వతీసమేత సిద్ధి సంగమేశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్టకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా అనంతగిరి రేంజ్ అటవీ సిబ్బంది 36 అడుగుల టేకు చెట్టును సమకూర్చారు. దీనిని మంగళవారం బ్రహ్మకుమారీలు శివలింగపురం నుంచి ట్రాక్టర్‌పై డుంబ్రిగుడ మీదుగా తీసుకువెళ్లారు. వచ్చే ఏడాది జనవరిలో ధ్వజస్తంభ ప్రతిష్ట జరుగుతుందని వారు పేర్కొన్నారు.

మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ కోర్సుకు దరఖాస్తుల స్వీకరణ

మహారాణిపేట(విశాఖ): వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ప్రాంతీయ శిక్షణా కేంద్రం ఆదేశాల ప్రకారం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు శిక్షణ కేంద్రాల్లో మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ (మహిళ) కోర్సులో ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈనెల 30లోగా దరఖాస్తులు పూర్తి చేసి సమర్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. వివరాలకు ప్రభుత్వ వెబ్ సైట్: http//cfw.ap.nic.inలో పొందుపరిచారు.

తుపాను హెచ్చరికల కేంద్రం సేవలు అద్భుతం



మాట్లాడుతున్న కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్

సాక్షి, విశాఖపట్నం : కచ్చితమైన వాతావరణ సమాచారాన్ని ప్రజలకు చేరవేస్తూ.. అధికారులను అప్రమత్తం చేయడంలో విశాఖ తుఫాను హెచ్చరికల కేంద్రం సేవలు అద్భుతమని కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్ అన్నారు. ఏయూలో మంగళవారం జరిగిన విశాఖపట్నం తుఫాను హెచ్చరికల కేంద్రం స్వర్ణోత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ ఐఎండీ మన దేశానికి ఎనలేని సేవలు అందిస్తోందన్నారు. సాంకేతిక సహాయాన్ని మరింత పెంపొందించుకోవటం ద్వారా భవిష్యత్తులో సంభవించే ప్రమాదాలను నివారించాలని సూచించారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో తక్కువ కాలంలో సంభవించే ప్రమాదాలను నివారించలేమని, భవిష్యత్తు కాలంలో జరగబోయే నష్టాలను నివారించగలమని స్పష్టం చేశారు. విశాఖ పరిధిలో కూడా సుమారు 14 వేల ఇళ్లు కొండవాలు ప్రాంతాల్లో ఉన్నాయని వాటి విషయంలో అప్రమత్తంగా ఉండాల్సి ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఆర్‌డబ్ల్యూఎస్‌ ఈఈగా జవహర్‌ కుమార్‌ బాధ్యతల స్వీకరణ


కలెక్టర్‌ దినేష్‌కుమార్‌ను కలిసిన జవహర్‌కుమార్‌

సాక్షి,పాడేరు: ఆర్‌డబ్ల్యూఎస్‌ ఈఈగా జవహర్‌ కుమార్‌ కె.జవహర్‌కుమార్‌ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా కలెక్టర్‌ ఎ.ఎస్‌.దినేష్‌కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయనకు దిగువస్థాయి అధికారులు అభినందనలు తెలిపారు.

పర్మినెంట్‌ చేయాలని కోరుతూ 30న కార్మికుల ధర్నా

అనకాపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌ కార్మికులను పర్మినెంట్‌ చేయాలని ఈ నెల 30న అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్‌.శంకరరావు తెలిపారు. మంగళవారం స్థానిక యూనియన్‌ కార్యాలయంలో గ్రేటర్‌ విశాఖ మున్సిపల్‌ కాంట్రాక్ట్‌ వర్కర్స్‌ యూనియన్‌ ధర్నా గోడపత్రికలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పారిశుధ్య కార్మికులు తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని, ఉద్యోగ భద్రత లేదని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం నేటికీ అమలు కాలేదని వాపోయారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఇది మంచి ప్రభుత్వం అని ప్రచారం చేసుకోవడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రంలో కాంట్రాక్ట్‌ వర్కర్లను పర్మినెంట్‌ చేసి మంచి ప్రభుత్వమని నిరూపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రేటర్‌ విశాఖ మున్సిపల్‌ కాంట్రాక్ట్‌ వర్కర్స్‌ యూనియన్‌ ఏడో జోన్‌ గౌరవాధ్యక్షుడు గంటా శ్రీరామ్‌, యూనియన్‌ అధ్యక్షుడు అజయ్‌, సభ్యులు నూకరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నెక్స్ట్‌ జనరేషన్‌ నెట్‌వర్క్‌పై సదస్సు

సింధియా(విశాఖ): నగరంలోని కామ్‌నెట్‌సెన్‌లో నెక్స్ట్‌ జనరేషన్‌ నెట్‌వర్క్‌, డిజిటల్‌ క్రిప్టోగ్రఫీపై మంగళవారం అత్యాధునిక సాంకేతిక సదస్సు జరిగింది. ఈ సదస్సును తూర్పు నావికాదళ చీఫ్‌ ఆఫ్‌ స్టాఫ్‌ వైస్‌ అడ్మిరల్‌ సమీర్‌ సక్సేనా ముఖ్య అతిథిగా ప్రారంభించారు. వివిధ నావికాదళ సంస్థల నుంచి కమాండర్లు, నిపుణులైన వక్తలు సెమినార్‌కు హాజరయ్యారు. సదస్సులో ఆర్టిఫీషియల్‌ ఇంటెలిజెన్స్‌, ఎన్‌క్రిప్షన్‌ పద్ధతులు, సురక్షిత కమ్యూనికేషన్‌, క్వాంటం క్రిప్టోగ్రఫీ, 6జీ కమ్యూనికేషన్‌ తదితర అంశాలపై చర్చ జరిగింది.

మృత్యు కుహరాలు

పర్యాటక ప్రాంతాలను తిలకించేందుకు వచ్చిన వారి ప్రాణాలను జలపాతాలు, కొండవాగులు కబళిస్తున్నాయి. అధికారులు కనీస భద్రతా చర్యలు తీసుకోకపోవడం సందర్శకుల పాలిట శాపంగా మారింది. ఆ ప్రాంతాలపై టూరిస్టులకు అవగాహన లేకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో ఆనందాన్ని పంచవలసిన విహారయాత్రలు పలు కుటుంబాల్లో విషాదాన్ని మిగులుస్తున్నాయి.

- టూరిస్టుల ప్రాణాలను హరిస్తున్న జలపాతాలు, కొండవాగులు
- పర్యాటక ప్రాంతాల్లో భద్రత చర్యలు శూన్యం


జలతరంగిణి వద్ద కర్రలతో తయారు చేసిన రైలింగ్‌ పట్టుకుని వెళుతున్న పర్యాటకులు (ఫైల్‌)

రంపచోడవరం: జిల్లాలో కొండవాగులు, జలపాతాలు మృత్యు కుహరాల్లా మారాయి. వీటి వద్ద కనీస భద్రతా చర్యలు చేపట్టకపోవడంతో ప్రకృతి అందాలను తిలకించేందుకు వచ్చే పర్యాటకులు ప్రాణాలు కోల్పోతున్నారు. తాజాగా మారేడుమిల్లి సమీపంలోని జలతరంగిణిలో ఐదుగురు వైద్య విద్యార్థులు గల్లంతు కాగా, వారిలో ముగ్గురు మృతి చెందారు. ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు.రెండు మృతదేహాలు లభ్యం కాగా, మరొకరి మృతదేహం లభ్యం కావాల్సి ఉంది.

- రెండేళ్ల క్రితం జలతరంగిణి జలపాతం వద్దే రాళ్లపై నుంచి జారి పడి ఒకరు మృతి చెందారు. - మారేడుమిల్లి వద్ద పాములేరులో దిగి సుమారు 25 మంది వరకు మృతవాత పడ్డారు.
- రెండేళ్లలో అమృతధార జలపాతం వద్ద నలుగురు మరణించారు.
- రంపచోడవరం సమీపంలోని సీతపల్లి వాగు వద్ద రెండేళ్లలో పది మంది మృతి చెందారు.

రక్షణ చర్యలు కరవు

జలపాతాల వద్ద ఎటువంటి రక్షణ చర్యలు లేవు. తాజాగా వైద్యులు మృతి చెందిన జలతరంగిణి జలపాతం వద్దకు పర్యాటకులు వెళ్లేందుకు కర్రలతో చేసిన రైలింగ్‌ ఏర్పాటు చేశారు. కర్రలు విరిగిపోయినప్పుడు కొత్తగా కర్రలు ఏర్పాటు చేస్తున్నారు తప్ప శాశ్వత రైలింగ్‌ ఏర్పాటు చేయడం లేదు. ఎకో టూరిజమ్‌ పేరుతో పర్యాటకుల నుంచి నగదు వసూలు చేస్తున్న అటవీశాఖ కనీస రక్షణ చర్యలు చేపట్టడంలో విఫలమవుతోంది. జలపాతం వద్దకు వెళ్లేందుకు పర్యాటకులకు టికెట్‌లు ఇచ్చి సరిపెడుతున్నారు తప్ప కనీసం పర్యవేక్షణ చేయడం లేదు. ఏజెన్సీ ప్రాంతానికి వచ్చే పర్యాటకుల ఇక్కడ ప్రమాదకర పరిస్థితులపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత కూడా ఉంది.

పర్యాటక ప్రాంతాల్లో భద్రతా చర్యలు


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న పీవో, సబ్‌కలెక్టర్‌

రంపచోడవరం: పర్యాటక ప్రాంతాల్లో భద్రతా చర్యలు తీసుకుంటామని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. ఐటీడీఏ సమావేశపు హాలులో మంగళవారం తహసీల్దార్లు, ఎంపీడీవోలు,పర్యాటకశాఖ, అటవీ శాఖ అధికారులు, ఇంజినీర్లుతో సమావేశం నిర్వహించారు.పర్యాటక ప్రాంతాల్లో రక్షణ కవచాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఇందుకు సంబంధించి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. మద్యం సేవించిన వాహనాలు నడిపే వారికి జరిమానా విధించాలన్నారు. పర్యాటకులు కాలువల్లో దిగకుండా ఇనుప కంచె ఏర్పాటుకు నివేదికలు తయారు చేయాలని ఆదేశించారు. రోడ్డుకు ఇరువైపులా జంగిల్‌ క్లియరెన్స్‌ చేయాలన్నారు. సబ్‌ కలెక్టర్‌ కల్పశ్రీ మాట్లాడుతూ ఏజెన్సీకి వచ్చే పర్యాటకులకు ఈ ప్రాంతంపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో టూరిజం రీజనల్‌ డైరెక్టర్‌ వి. స్వామినాయుడు, సబ్‌ డీఎఫ్‌వో బి.శ్రీరాములు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నడుమ ఘర్షణ

- ఉపాధ్యాయుడి ఇంటిపై మరో ఉపాధ్యాయుడి వర్గీయుల దాడి
- వందల మందితో అంబేడ్కర్‌ కూడలిలో ఆందోళన
- స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఘర్షణ
- అయినా పట్టించుకోని పోలీసులు


ఉపాధ్యాయుడు అప్పారావు ఇంటికి దాడికి వెళ్లిన తిరుపతిరావు వర్గీయులు


అంబేడ్కర్‌ కూడలిలో ఆందోళన

పెదబయలు : మండల కేంద్రంలో ఇద్దరు ఉపాధ్యాయుల మధ్య జరిగిన గొడవ ముదిరి సామాజిక వర్గాల గొడవగా మారి తీవ్ర ఘర్షణకు దారితీసింది. మంగళవారం సాయంత్రం పెదబయలులో నివాసం ఉంటున్న ఓ ఉపాధ్యాయుడి ఇంటిపై మరో వర్గం వారు దాడి చేశారు. వివాహేతర సంబంధం నేపథ్యంలో జరిగిన గొడవలో రాజీ కుదర్చడానికి వెళ్లిన ఉపాధ్యాయుల మధ్య మాటా మాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. వివరాలివి. పలాసి తిరుపతిరావు అనే ఉపాధ్యాయుడిపై ఈ నెల 22న తేదీన కొంత మంది భౌతికదాడికి పాల్పడ్డారు. ఈ విషయంపై ఆయన పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే మంగళవారం తిరుపతిరావు వర్గీయులు పెదబయలులో నివాసం ఉంటున్న మర్రిచెట్టు అప్పారావు ఇంటికి వెళ్లి మాస్టారి కుమారుడు మనోజ్‌, కోడలు గర్భిణి అయిన స్వప్నపైనా దాడి చేశారు. దాడి తరువాత అంబేడ్కర్‌ కూడలి వద్దకు ర్యాలీగా వెళ్లి ఆందోళన చేశారు. కాగా పోలీసు స్టేషన్‌ సమీపం నుంచే ర్యాలీగా వెళ్లి ఉపాధ్యాయుడి ఇంటిపై దాడి చేసినా పోలీసులు దృష్టి పెట్టకపోవడం విశేషం. దాడి జరిగిన తరువాత వందల మంది రోడ్డుపైకి చేరిన వారిని చెదరగొట్టే ప్రయత్నం చేయలేదు. దీంతో స్థానికంగా భయాందోళన నెలకొంది. దీనిపై ఎస్‌ఐ కె.రమణను సాక్షి వివరణ కోరగా ఇరువర్గాలపై కేసు నమోదు చేయడం జరిగిందని, గాయాలైన గర్భిణిని పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించడం జరిగిందని అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇలాంటి పరస్పర దాడులు మంచిది కాదని, శాంతి భద్రతలను విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

27న బ్యాంకు ఉద్యోగుల సమ్మె

సీతమ్మధార (విశాఖ) : సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27న యూనియన్‌ బ్యాంకు ఉద్యోగులు, అధికారుల సంఘం చేపట్టిన సమ్మెను విజయవంతం చేయాలని సంఘం నాయకులు సీతమ్మధారలోని బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌ యూనియన్‌ బ్యాంకు ఎంప్లాయీస్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి ఉదయ కుమార్‌ మాట్లాడుతూ బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, కాంట్రాక్ట్‌ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించాలని, అప్రెంటిస్‌ నియామకాలు నిలిపివేయాలని డిమాండ్‌ చేశారు. అధికారుల సంఘం నాయకుడు కె.రమేష్‌ మాట్లాడుతూ రాత్రి ఏడు గంటలు దాటినా ఇంటికి వెళ్లలేకపోయిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రీజినల్‌ కార్యదర్శి వసంతరావు, సాగర్‌, శ్రీనివాస్‌, ప్రత్యూష, తదితరులు పాల్గొన్నారు.

పలు ఆలయాల ఈవోల బదిలీ

మహారాణిపేట(విశాఖ): దేవదాయ శాఖలో పలువురు ఈవోలను బదిలీ చేస్తూ ఆ శాఖ కమిషనర్‌ ఎస్‌.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం టర్నర్‌ చౌల్ట్రీ ఈవో టి.రాజగోపాల్‌ రెడ్డిని సంగివలస శ్రీ పోలమాంబ ఆలయం ఈవోగా, సంగివలస శ్రీ పోలమాంబ ఆలయం ఈవో బండారు ప్రసాద్‌ను మురళీనగర్‌ శ్రీ వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయ గ్రూప్‌ ఈవోగా నియమించారు. అనకాపల్లి జిల్లా చోడవరం గ్రూప్‌ ఆలయాల ఈవో ఎస్‌.వి.వి. సత్యనారాయణమూర్తిని కొంకోట ఆలయాల గ్రూప్‌ ఈవోగా బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఈవో కీర్తి శ్రీనివాసరావును మెయిన్‌రోడ్డు శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆలయం గ్రూప్‌ ఈవోగా నియమించారు. అఫీషియల్‌కాలనీ శ్రీ బుచ్చిరామలింగేశ్వర స్వామి ఆలయం ఈవో బి.శ్రీనివాస్‌ను ఇసుకకొండ శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయ ఈవోగా నియమించారు. అలాగే బి.వి.ఎస్‌.ఎస్‌.ఎం.కృష్ణను అనకాపల్లి శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ గ్రూపు ఈవోగా, కె.ఆదినారాయణను ఎల్‌బీకాలనీ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ఈవోగా, కె.పద్మావతిని అఫీషియల్‌ కాలనీ శ్రీ బుచ్చిరామలింగేశ్వర స్వామి ఆలయ ఈవోగా, టి.సాంబశివరావును నర్సీపట్నం గ్రూప్‌ ఆలయాల ఈవోగా నియమించారు. ఈవోలు తమకు కేటాయించిన స్థానాల్లో వెంటనే బాధ్యతలు స్వీకరించాలని కమిషనర్‌ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మద్యం మత్తులో వృద్ధుడి ఆత్మహత్య


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసరావు

చింతూరు : మద్యం మత్తులో మతిస్థిమితం కోల్పోయి వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చింతూరు మండలం చట్టిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అవివాహితుడైన చట్టికి చెందిన తుర్రం పెంటయ్య(58) మద్యంమత్తులో మతిస్థిమితం కోల్పోయి వింతగా ప్రవర్తించేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి అధికంగా మద్యం సేవించిన అతను గ్రామంలోని మామిడిచెట్టుకు తువ్వాలుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం ఈ ఘటనను చూసిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహానికి చింతూరు ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

‘పర్యాటకం’పై 26న వ్యాసరచన పోటీలు

మహారాణిపేట: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న వివిధ అంశాలపై పోటీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్‌ ఎం.ఎన్‌.హరేందిర ప్రసాద్‌ తెలిపారు. ‘టూరిజం అండ్‌ పీస్‌’అనే అంశంపై యువ టూరిజం క్లబ్‌ ద్వారా పాఠశాలలు, కళాశాలల్లో వ్యాసరచన, చిత్రలేఖనం, ఫొటోగ్రఫీ, లఘుచిత్రాల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే ఆ రోజు ఉదయం ఆరు గంటలకు హెరిటేజ్‌ వాక్‌ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యమైన కూడళ్లలో విశాఖలోని అందమైన పర్యాటక ప్రాంతాలకు సంబంధించిన ఫొటోగ్యాలరీని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పోటీల్లో విజేతలకు 27న బహుమతులు అందిస్తామన్నారు. పూర్తి వివరాలకు జిల్లా పర్యాటక అధికారి(94949 18484), డీఈవో, ఆర్‌ఐవోలను సంప్రదించవచ్చు.

‘స్టీల్‌’ మెల్ట్‌ షాప్‌-1లో ప్రమాదం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌ స్టీల్‌ మెల్ట్‌ షాప్‌-1లో జరిగిన ప్రమాదంలో విభాగం సీనియర్‌ మేనేజర్‌ సీహెచ్‌ మల్లేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలివి.. విభాగంలోని ఎల్‌పీ బేలో స్టీల్‌ ట్రాన్స్‌ఫర్‌ కార్‌పై ఉన్న ల్యాడిల్‌లో ద్రవపు ఉక్కు ఉంది. కార్‌ కదులుతుండగా ల్యాడిల్‌లో పేలుడు సంభవించింది. దీంతో ల్యాడిల్‌లో ఉన్న ద్రవపు ఉక్కు పైభాగం ఒక్కసారిగా బయటకు విరజిమ్మింది. ఆ సమయంలో అక్కడ ఉన్న షిఫ్ట్‌ ఇన్‌చార్జ్‌ మల్లేశ్వరరావు శరీరంపై ద్రవపు ఉక్కు పడడంతో ఒళ్లంతా కాలి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సహోద్యోగులు అతన్ని అంబులెన్స్‌లో ఉక్కు జనరల్‌ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం నగరంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అతని శరీరం 80 శాతం మించి కాలినట్లు వైద్యులు పేర్కొంటున్నారు. మల్లేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు.

అంతర రైల్వేస్‌ బాక్సింగ్‌ పోటీలు ప్రారంభం

విశాఖ స్పోర్ట్స్‌: ఆల్‌ ఇండియా అంతర రైల్వేస్‌ బాక్సింగ్‌ చాంపియన్‌షిప్‌ను డీఆర్‌ఎం సౌరభ్‌ ప్రసాద్‌ మంగళవారం ప్రారంభించారు. 14 జోనల్‌ రైల్వేలకు సంబంధించి 12 జట్లకు చెందిన 125 మంది మెన్‌, వుమెన్‌ బాక్సర్లు ఆయా వెయిట్‌ కాటగిరీల్లో తలపడుతున్నారు. మూడు రోజుల పాటు స్థానిక శ్రీనివాస కళ్యాణమండపం ప్రాంగణంలో ఈ పోటీలు ఈకోర్వావాల్తేర్‌ ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా ఆతిథ్య ఈకోరైల్వే తరఫున వుమెన్‌ కాటగిరిలో ఎస్‌.ఉష, మౌనిక సోను, మెన్‌లో కె.శ్యాంకుమార్‌ పోటీ పడుతున్నారు. ఇదిలా ఉండగా మెన్‌లో ఆలీ కొమర్‌, వెంకటేషన్‌, మనోజ్‌కుమార్‌, తౌరవ్‌, జితేంద్ర, సాగరమాల, జయదేవ్‌, దివాకర్‌, సచిన్‌, సంజీత్‌లు ఆయా జోన్‌ జట్ల తరఫున పోటీపడుతున్నారు. వుమెన్‌లో సోనియా లథేర్‌, సోనియా చాహల్‌, మంజు, అనామిక, జ్యోతి, శశిచోప్రా, అల్ఫ్యా, గీతిక, రోసీబేబి, సాన మచా ఆయా వెయిట్‌ కాటగిరీల్లో జోన్‌ జట్ల తరఫున సత్తాచాటనున్నారు. మెన్‌ కాటగిరీలో తొలి బౌట్‌ను లోకోమోటివ్‌ వర్క్స్‌, వెస్ట్రన్‌ రైల్వే బాక్సర్ల మధ్య జరిగిన పోటీని డీఆర్‌ఎం సౌరభ్‌ ప్రసాద్‌ ప్రారంభించారు.

మహిళల కేటగిరీలో తొలిరోజు ఏడు వెయిట్‌ కేటగిరిల్లో 19బౌట్‌లు నిర్వహించారు. తొలి బౌట్‌ను 5-0తో లోకోమోటివ్‌ వర్క్స్‌ బాక్సర్‌ విజయం సాధించారు. ఎస్‌సీఆర్‌ 4-3తో ఎన్‌ఆర్‌పై విజయం సాధించగా అదే స్కోర్‌తో ఎన్‌డబ్ల్యూఆర్‌ జట్టుపై సదరన్‌ రైల్వే విజయం సాధించింది.సెంట్రల్‌ రైల్వే 5-0తో ఈస్టన్‌రైల్వేపైన, మరో బౌట్‌లోనూ సెంట్రల్‌రైల్వే 5-2తో ఎస్‌సీఆర్‌ పైన విజయం సాధించింది. కార్యక్రమంలో మంజుశ్రీ, వైస్‌ ప్రెసిడెంట్‌ మధుస్మిత, ఏడీఆర్‌ఎం మనోజ్‌కుమార్‌, క్రీడాధికారి ప్రవీణ్‌బాఠి, సంయుక్త క్రీడాధికారులు అవినాష్‌, అశోక్‌కుమార్‌లు పాల్గొన్నారు.

ప్రాణాలు తీసిన అతివేగం

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి
- మరో యువకుడికి తీవ్ర గాయాలు
- డివైడర్‌ను బైక్‌ ఢీకొనడంతో ఘటన


ప్రవీణ్‌, ప్రశాంత్‌ మృతదేహాలు


గాయపడిన మహేష్‌

మర్రిపాలెం(విశాఖ): అతివేగం ఇద్దరు యువకులను బలితీసుకుంది. వారి కలలను చిదిమేసింది. ఇరు కుటుంబాల్లో విషాదం నింపింది. ఎంతో భవిష్యత్‌ ఉన్న యువకులు ఇలా అకాల మరణం చెందడం చుట్టుపక్కల వారిని కలచివేసింది. కాగా.. డివైడర్‌ను ఢీకొన్న స్పోర్ట్స్‌ బైక్‌ సుమారు 200 మీటర్ల దూరం వరకు దూసుకుపోయింది. అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. కంచరపాలెం ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జాతీయ రహదారిపై మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఉదయం 6గంటల ప్రాంతంలో ఊర్వశి జంక్షన్‌ నుంచి తాటిచెట్లపాలెం వైపుగా ముగ్గురు యువకులు ద్విచక్రవాహనంపై అతి వేగంగా వెళ్తున్నారు. సంజీవ్‌నగర్‌ జాతీయ రహదారి వద్దకు వచ్చే సరికి వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న ప్రవీణ్‌(20), మధ్యలో కూర్చున్న ప్రశాంత్‌(20) ఘటనా స్థలంలోనే మృతి చెందారు. వెనుక కూర్చున్న మహేష్‌ తీవ్రగాయాల పాలయ్యాడు. అతడిని స్థానికులు 108 అంబులెన్స్‌ సాయంతో చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. సీతంపేటకు చెందిన ప్రవీణ్‌ బెహరా పాలిటెక్నిక్‌ కాలేజీలో డిప్లమో పూర్తి చేశాడు. అతని తండ్రి అచ్చిబాబు మాజీ సైనికుడు. తల్లి మహిళా మిత్రలో పనిచేస్తున్నారు. వీరికి ప్రవీణ్‌ ఒక్కడే కుమారుడు. దొండపర్తికి చెందిన ప్రశాంత్‌ ఇంటర్మీడియట్‌ వరకు చదివి ఆపేశాడు. అతని తండ్రి బుజ్జి పెయింటర్‌. కప్పరాడకు చెందిన మహేష్‌ వెల్ఫేర్‌ పాలిటెక్నిక్‌ కాలేజీలో చివరి సంవత్సరం చదువుతున్నాడు. ప్రవీణ్‌ తన తల్లిదండ్రులను రైల్వేస్టేషన్‌లో దించేందుకు సీతంపేటలో ఆటో ఎక్కించాడు. దొండపర్తిలో తన స్నేహితుడైన ప్రశాంత్‌ని బైక్‌పై ఎక్కించుకుని రైల్వేస్టేషన్‌కి వెళ్లి తల్లిదండ్రులను రైలు ఎక్కించాడు. నగరంలో బైక్‌పై తిరుగుదామని వీరిద్దరూ కలిసి కప్పరాడలో మహేష్‌ను ఎక్కించుకుని కంచరపాలెం వైపు వస్తున్న క్రమంలో ప్రమాదం జరిగినట్లు సమాచారం. కాగా.. ప్రమాదం జరిగిన ప్రాంతం నుంచి సుమారు 200 మీటర్ల వరకు ద్విచక్ర వాహనం దూసుకుపోయింది. ఘటనా స్థలానికి కంచరపాలెం ట్రాఫిక్‌ సీఐ దాశరథి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. గాయపడ్డ మహేష్‌ ఫిర్యాదు మేరకు ట్రాఫిక్‌ సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదస్థాయికి రైవాడ

దేవరాపల్లి (అనకాపల్లి): రైవాడ జలాశయం నీటి మట్టం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. జలాశయం గరిష్ట నీటి మట్టం 114 మీటర్లు కాగా.. ప్రస్తుతం 113 మీటర్లకు చేరుకుంది. మరో వైపు జలాశయంలోకి 350 క్యూసెక్కుల మేర వర్షపు నీరు వచ్చి చేరుతోంది. మంగళవారం రాత్రి 2 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదు కావడంతో బుధవారం ఉదయానికి జలాశయంలోకి ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉంది. జలాశయం ప్రమాదకర స్థాయి నీటి మట్టం 113.50 మీటర్లకు కేవలం 50 సెంటీమీటర్లు మాత్రం దూరంలో ఉండడంతో జలాశయం అధికారులు అప్రమత్తమయ్యారు. మిగిలిన నీటిని స్పిల్వే గేట్ల ద్వారా బుధవారం రాత్రి లేదా గురువారం ఉదయానికి శారదా నదిలోకి నీటిని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. శారదానది పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

సారా బట్టీలపై పోలీసుల దాడులు

నర్సీపట్నం: మున్సిపాలిటీ పరిధి బయపురెడ్డిపాలెం శివారులో సారా బట్టీలపై సీఐ రేవతమ్మ, ఎస్సై రమేష్‌ మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన మూడు వేల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీకి వినియోగించే వంట పాత్రలు, గ్యాస్‌ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. సారా బట్టీలను నిర్వహిస్తున్న వారి వివరాలను సేకరించి వారిపై కేసులు నమోదు చేస్తామని సీఐ పేర్కొన్నారు.